క్లుప్తంగా

సత్యనారాయణకు ఉగాది పురస్కారం



మహబూబాబాద్ రూరల్: పట్టణానికి చెందిన కవి, రచయిత గుర్రపు సత్యనారాయణ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. శనివారం మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సత్యనారాయణను ప్రముఖ సినీగేయ రచయిత భువనచంద్ర ఘనంగా సన్మానించి, ప్రశంస పత్రాన్ని అందజేశారు.

ఎంబీబీఎస్‌లో పట్టా సాధించిన గాయత్రి



మహబూబాబాద్ అర్బన్: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. మానుకోట జిల్లా కేంద్రంలో గూమ్మూడూరుకు చెందిన సోమారపు వీరస్వామి యాకమ్మ దంపతుల కుమార్తె గాయత్రి ఎంబీబీఎస్ పూర్తిచేశారు. ఈక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ ఎంబీబీఎస్ పట్టాను అందజేశారు.

ప్రశంసపత్రాల అందజేత

గార్ల: కంప్యూటర్ అప్లికేషన్స్‌లో రాష్ట్రస్థాయిలో గార్ల డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ప్రవేశపెట్టిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ కార్యక్రమంలో స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు బి.జైపాల్, డి.భార్గవి, బి.సందీప్, జి.శివ సాయిచరణ్, జె.మహేందర్ రాష్ట్రస్థాయిలో నోట్స్ అండ్ పాస్‌వర్డ్ మేనేజర్‌పైన ఉత్తమ ప్రదర్శన కనబర్చడంతో వీరికి ప్రశంసపత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ నర్సమ్మ, అధ్యాపకులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెహ్రూసెంటర్: విద్యుత్ లైన్లపై ఉన్న చెట్టు కొమ్మల తొలగింపు కారణంగా కొత్త బజారులో ఉదయం 6గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ నవ్య శనివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని పులిగోపాల్‌నగర్, ఇనుకేబుల్ ఏరియా, మార్వాడి సత్రం, ప్రభుత్వ ఆస్పత్రి, కురవి రోడ్డు, సాలార్‌తండా, అయ్యప్పనగర్, కవిత కాలనీ ఏరియాలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పీరయ్య



నెహ్రూసెంటర్: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా గుగ్గిళ్ల పీరయ్యమాదిగ ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు.

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్: కుష్ఠు వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీపీఎంఓ ఎల్లయ్య కోరారు. మండలంలోని చిలుకోడు, పెరుమాళ్ల సంకీస గ్రామంలో శనివారం ప్రత్యేక శిబిరాలు నిర్వహించి సుమారు 35 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డీపీఎంఓ ఎల్లయ్య మాట్లాడుతూ.. సర్వేలు, ప్రత్యేక శిబిరాల ద్వారా పరీక్షలు నిర్వహించి, కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించామని తెలిపారు. వీరికి చికిత్స ప్రారంభించి ఆరు నెలల కోర్సు మందులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వీరబాబు, సూపర్‌వైజర్లు వెంకన్న, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాహార్తి తీర్చేందుకే నీటి తొట్లు



మహబూబాబాద్: జీవాల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టిలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జీవాల కోసం 14 నీటి తొట్టిలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

మహబూబాబాద్ రూరల్: దేశ భవిష్యత్, రక్షణ, అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందని పార్టీ మండల అధ్యక్షుడు మారగాని రాజుగౌడ్ అన్నారు. శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ముదుపుగల్లు గ్రామంలో పార్టీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు గండి కరుణాకర్, బానోతు రమేష్, బూత్ ప్రధాన కార్యదర్శి శీలం రంజిత్, మండల కార్యదర్శి గుగులోత్ వీరన్న, గ్రామ కమిటీ సభ్యులు గుర్రం నవీన్, జెరిపోతుల నరేష్, శీలం వెంకన్న, గండి సరేష్ పాల్గొన్నారు.

తొర్రూరు: కేంద్రంలో మూడో పర్యాయం బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. శ్రీమాన్ మాట్లాడుతూ.. 14 కోట్ల సభ్యత్వంతో బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందని తెలిపారు. దేశహితం కోసం పని చేసే ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. మోదీ నాయకత్వంలో 400 పార్లమెంట్ స్థానాలు గెలుచుకుంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు కిన్నెర యాదగిరి, మంగళపల్లి యాకయ్య, శేఖర్, భరత్, నవీన్ పాల్గొన్నారు.

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లో పార్టీ మండల అధ్యక్షుడు పాదిల నర్సింహారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా గ్రామంలోని 48, 49వ బూత్‌లలో బీజేపీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఓలం శ్రీనివాస్, వల్లభు వెంకటేశ్వర్లు, తుంపిళ్ల శ్రీనివాస్,



తొర్రూరు: జెండాకు వందనం చేస్తున్న నాయకులు



మహబూబాబాద్ రూరల్: ముదుపుగల్లులో..



డోర్నకల్: జెండా ఆవిష్కరిస్తున్న దేవానాయక్

వేముల కొమ్మాల్‌రెడ్డి, రామడుగు వెంకటాచారి, రడం వెంకన్న, గాంతి వెంకట్‌రెడ్డి, నాగేశ్వరాచారి, తుమ్మకుమార్, ఉపేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజు, కొణతం పెంటయ్య, రేషబోయిన కృష్ణ, మల్లికార్జున్, నాగరాజు, శంకర్‌రావు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు సందెల శ్రీనువాస్, డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ తాడా పూర్ణచందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అల్లం సాయి, చిన్నల ప్రవీణ్, రాణిరెడ్డి, నాగిరెడ్డి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు దేవానాయక్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు చింతమల్ల జయరాజ్, సుమన్, హర్షవర్ధన్, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



మహబూబాబాద్: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



కురవి: ర్యాలీ నిర్వహిస్తున్న ఐకేపీ సిబ్బంది

మహబూబాబాద్: ప్రజాస్వామ్యంలో ఓటు బ్రహ్మాస్త్రం లాంటిదని అర్హత గల వారందరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని మున్సిపల్ డీఈ సీహెచ్.ఉపేందర్ కోరారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ అధికారి గుజ్జు క్రాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి జ్యోతిరావు పూలే సెంటర్ వరకు స్వీప్‌పై శనివారం అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలంటూ ప్లకార్డులను పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దామోదర్, ఐకేపీ డీపీఎం రాజు, ఏపీఎం రాజేర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దుర్గా, ఐకేపీ సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

నెల్లికుదురు: పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కోవాలని ఎంపీడీఓ బాలరాజు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై శనివారం స్థానిక మండల మయూరి సమాఖ్య కార్యాలయంలో వీఓ సంఘం మహిళలు, సీసీలు, వీఓఏలు సంఘం బాధ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కురవి: మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీఎం సత్యనారాయణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మామిడాల అలేఖ్య, సీసీలు, సతీష్, రామారావు, కృష్ణయ్య, ఇందిర, ఉష, మంజుల సులోచన, వీఓఏలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

మరిపెడ: నీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గుగులోతు అరుణ అన్నారు. శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అధికారులు క్షేత్రస్థాయిలో నివేదికలు తెచ్చి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజల నుంచి నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా చూడాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ రేవతి, వైద్యాధికారి గుతులోతు రవి, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చూడాలి

నర్సింహులపేట: వేసవిలో నీటి, విద్యుత్ సమస్య రాకుండా చూడాలని వైస్ ఎంపీపీ జాటోత్ దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడైన పైపు లీకేజీలు ఉంటే సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ భూక్య సంగీత, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శ్రీను, ఎంపీఓ సోమ్‌లాల్, ఏఈ పాండు, ఏఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.



మరిపెడ: మాట్లాడుతున్న ఎంపీపీ అరుణ

రోడ్డు ప్రమాదంలో గాయాలు

బయ్యారం: మండలంలోని చెన్నంగలగడ్డ సమీపంలో శనివారం ఎదురుగా వస్తున్న లారీని, మోటర్‌సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడ మండలం కార్లాయి గ్రామానికి చెందిన కేదాస్ ప్రసాద్ గార్ల మండలం మద్దివంచకు చెందిన సైదమ్మను తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకొని రామచంద్రాపురం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బయ్యారం వైపు వస్తున్న లారీని ఢీ కొనటంతో ఇరువురికి తీవ్రగాయాలైనాయి. వెంటనే చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు.

రేపు ఇసుక వేలం

మహబూబాబాద్ రూరల్: పట్టుబడిన ఇసుకను ఈనెల 8వ తేదీన వేలం వేయనున్నట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి శనివారం తెలిపారు. అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాల మేరకు ఇసుక వేలానికి చర్యలు తీసుకున్నామని, ఆసక్తి ఉన్నవారు సోమవారం ఉదయం గంటలకు వచ్చి ఇసుకను పరిశీలించి వేలంలో పాల్గొనాలని కోరారు.

తుక్కుగూడ సభకు తరలిన నాయకులు



కేసముద్రం నుంచి సభకు వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు



పెద్దవంగర నుంచి..

గార్ల: హైదరాబాద్‌లోని తుక్కుగూడ జనజాతర సభకు గార్ల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వాహనాల ద్వారా భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, గుండా వెంకట్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణగౌడ్, యాకూబ్‌పాషా, బాబూరావు ఉన్నారు.

మహబూబాబాద్ రూరల్: తుక్కుగూడ బహిరంగ సభకు జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. అర్బన్ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పోతురాజు, తాళ్లపల్లి జగన్, భూక్యా శ్రీను పాల్గొన్నారు.

డోర్నకల్: తుక్కుగూడ సభకు డోర్నకల్‌తోపాటు పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు.

కేసముద్రం: కేసముద్రంస్టేషన్ నుంచి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, గంట సంజీవరెడ్డి, బండారు వెంకన్న, కదిర సురేందర్, బండారు దయాకర్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలంలో వివిధ గ్రామాలనుంచి సభకు భారీగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, నెమ్మది యాకయ్య, కొమ్మినేని సతీష్, నాయకులు బాలాజీ, నవీన్‌రెడ్డి, ధర్మారపు వెంకన్న పాల్గొన్నారు.

పెద్దవంగర: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల నుంచి జనజాతర సభకు కాంగ్రెస్ శేణులు భారీ ఎత్తున తరలివెళ్లారు కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రంగు మురళిగౌడ్, యూత్ నాయకుడు బీసు హరికృష్ణ, నాయకులు శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, వీరారెడ్డి, పాల్గొన్నారు.

కురవి: జన జాతర సభకు కురవి, సీరోలు మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో మండలాల అధ్యక్షులు అంబటి వీరభద్రం, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి, రాముునాయక్, రజనీకాంత్, వేణు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా' కూటమిని గెలిపించాలి



మాట్లాడుతున్న విజయసారథిరెడ్డి

నెహ్రూసెంటర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలను ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం చింతకుంట్ల వెంకన్న అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా విజయసారథిరెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లలో తెలంగాణను నాశనం చేసిన బీఆర్ఎస్, దేశ సంపదను కార్పొరేట్లకు ఊడిగం చేసిన బీజేపీలను ఎన్నికల్లో ఓడించాల్సిందేనన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి 350పైగా సీట్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు అజయ్‌సారథిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, కుమార్, సాంబలక్ష్మి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే షీటీం

కేసముద్రం: మహిళల భద్రత కోసమే షీటీం పని చేస్తుందని షీటీం ఎస్సై సునంద అన్నారు. శనివారం మండలంలోని సబ్‌స్టేషన్ తండా జీపీలో గల సెయింట్ జాన్స్ స్కూల్‌లో ఏహెచ్‌టీయూ యూనిట్, షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో 2014లో షీటీం ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై ఆనందం, సిబ్బంది అరుణ, పార్వతి, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై సునంద

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

దంతాలపల్లి: తండ్రికి కూతురు తలకొరివి పెట్టిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన చీకటి ఉమేష్‌కు(45) సుశ్మిత, శ్వేత అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పిల్లలు చిన్న వయసులో ఉన్నప్పుడే ఉమేష్ భార్య రమ చనిపోయింది. ఈనెల 4న ఉమేష్ సొంత పనులపై సూర్యాపేటకు వెళ్లాడు. అక్కడ రోడ్డుపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గాయాలైన ఉమేష్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతిచెందాడు. మృత దేహాన్ని మండల కేంద్రానికి తీసుకువచ్చారు. మృతుడు ఉమేష్‌కు కుమారులు లేక పోవడంతో పెద్ద కూతురు సుశ్మిత తండ్రికి తలకొరివి పెట్టింది.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న రాజ్‌కుమార్

పెద్దవంగర: ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పల్లె దవాఖాన వైద్యుడు రాజ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కొరిపల్లి గ్రామంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవంను పురస్కరించుకొని మందస్తుగా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గ్రామస్తులకు ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణలో అన్నింటి కన్నా ముఖ్యమైనది మన జీవనశైలే నని పేర్కొన్నారు. మంచి ఆహారం తీసుకోవాలని క్రమం తప్పకుండా వ్యాయామం చేసుకోవాలన్నారు. తాజాగా ఉన్న ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాలని తెలిపారు. బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండేలా చొరవ చూపాలన్నారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జీపీ ప్రత్యేక అధికారి స్వాతి, కార్యదర్శి రజిత, హెల్త్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మీ పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

గార్ల: జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సక్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చిన్నకిష్టాపురం గ్రామంలో ఉపాధి కూలీల పని ప్రదేశాలను ఆయన సందర్శించారు.

సంక్షిప్త సమాచారం

జాగ్రత్తలు తీసుకోవాలి

దంతాలపల్లి: వాతావరణంలో ఉష్ణోగ్రతలు ఎక్కువ ఉండడం వలన ప్రజలు వడదెబ్బ తగులకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దముప్పారం పల్లె దవాఖాన వైద్యురాలు వాణి అన్నారు. మండలంలోని రామానుజపురం గ్రామంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వడదెబ్బ తగిలిన వారు తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

డోర్నకల్: స్థానిక పంపుబావితండాకు చెందిన ఓ వివాహిత ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైంది. డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ శిరీష ఈనెల 4న కుమార్తెకు పుస్తకాలు కొనేందుకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికిన అనంతరం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రంగారెడ్డి సేవలు మరువలేనివి

మరిపెడ: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రామసహాయం రంగారెడ్డి సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మరిపెడలోని నవీన్ గెస్ట్‌హౌస్‌లో ఇటీవలే మృతిచెందిన రంగారెడ్డి సంతాపసభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారద, తాళ్లపెల్లి శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

నేటినుంచి కొండలమ్మ జాతర

గార్ల: గార్ల మండలం పినిరెడ్డిగూడెం గ్రామ సమీపంలోని కొండలమ్మ దేవాలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు అశేష భక్తులకు ఇలవేల్పు అయిన కొండలమ్మ జాతర నిర్వహించనున్నట్లు ఆలయ జాతర కమిటీ నిర్వాహకులు శనివారం తెలిపారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ఆర్థికసాయం

కేసముద్రం: కేసముద్రంవిలేజ్ శివారు ఎన్టీఆర్‌నగర్‌లో పల్లకొండ సమ్మయ్య(62) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ అంత్యక్రియలకుగాను రూ.5వేల ఆర్థికసాయం అందజేశాడు. అదేవిధంగా కేసముద్రంవిలేజ్‌కి చెందిన అంతర్యామి సంస్థ ఆధ్వర్యంలో రూ.8వేలు అందజేశారు.

'గుర్తింపు లేని వారు విమర్శిస్తున్నారు..'

డోర్నకల్: బీఆర్ఎస్‌లో ప్రాముఖ్యత లేని, పదవి కోల్పోయిన వారే తమను విమర్శిస్తున్నారని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజలు కోరుకున్న పాలనను అందిస్తుందనే నమ్మకం, బీఆర్ఎస్ పెద్దలు చెప్పుడు మాటలకు ప్రాధాన్యం ఇవ్వడంపై అసంతృప్తితో కాంగ్రెస్ పార్టీలో చేరామన్నారు. అక్రమ వ్యాపారాలు, పదవి వ్యామోహం, కాంట్రాక్టు పనుల కోసం పార్టీలో చేరలేదన్నాడు. తమను విమర్శించే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని కోటిలింగం అన్నారు.

రణదివె స్ఫూర్తితో ముందుకు..

నెహ్రూసెంటర్: కార్మికోద్యమ నేత, సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదివె స్ఫూర్తితో కార్మిక ఉద్యమాలను ముందుకు తీసుకుపోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జీకే కోల్డ్ స్టోరేజ్ వద్ద సీఐటీయూ పట్టణ కన్వీనర్ కుమ్మరి కుంట్ల నాగన్న అధ్యక్షతన రణదివె వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సమ్మెట రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓకు మాతృవియోగం

మహబూబాబాద్ రూరల్: డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబాల అంబరీష తల్లి అంబాల దుర్గమ్మ మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో శనివారం మృతిచెందారు. డీఎంహెచ్ఓ కళావతిబాయి, కార్యాలయ సిబ్బంది వారి నివాసానికి వెళ్లి దుర్గమ్మ మృదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని దామ్య తండా గ్రామ పంచాయతీ పరిధిలోని తోక బోడ్ తండాలో బోర్‌వెల్ పనులను కాంగ్రెస్ నాయకులు, మల్యాల మాజీ ఎంపీటీసీ బానోతు చిమ్నానాయక్, బాదావత్ చంద్రు శనివారం ప్రారంభించారు.

ఇఫ్తార్ విందు

పెద్దవంగర: మండలంలోని అవుతాపురం గ్రామంలో ముస్లింలకు శుక్రవారం రాత్రి మాజీ సర్పంచ్ సట్లెండి మంజుల సుధాకర్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

ఘన నివాళి

గార్ల: మండలంలో సీపీఐ బలోపేతానికి కృషి చేసి అమరుడైన కట్టెబోయిన వెంకటేశ్వర్లు చిరస్మరణీయుడిగా నిలిచిపోయాడని సీపీఐ రాష్ట్ర నాయకుడు కట్టెబోయిన శ్రీనివాసరావు అన్నారు. వెంకటేశ్వర్లు వర్ధంతిని పురస్కరించుకొని మద్దివంచ గ్రామంలో గల ఆయన స్థూపం వద్ద పార్టీ నాయకులు నివాళులర్పించారు.

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

మహబూబాబాద్ అర్బన్: కాకతీయ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ ఫలితాల్లో నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యధిక శాతం ఉత్తమ ఫలితాలు సాధించారని నలంద కళాశాల చైర్మన్ నూకల శ్రీరంగారెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ, డైరెక్టర్ సాధన, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ శనివారం తెలిపారు. బీఎస్సీ మాథ్స్ విభాగంలో కోడి మానస 8.66, సీహెచ్. జోత్స్న 8.32, బీఎస్సీ సైన్స్ విభాగంలో కట్ల మానస 8.11, సంద రుచిత 8.08, బీకాం విభాగంలో బానోత్ అంకిత 8.81, నలమాస స్రవంతి 8.68, బీఏ విభాగంలో మడత రవళి 8.00, రావోలు కళ్యాణి 7.78 సాధించారు. ఉత్తమ విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

బయ్యారం: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు కానూరి వెంకటేశ్వరరావు వర్ధంతి సభను ఈనెల 10న బయ్యారంలో నిర్వహించనున్నట్లు ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సనప పొమ్మయ్య తెలిపారు. శనివారం మండలంలోని సుద్దరేవులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, లింగన్న, భిక్షపతి, కొమురయ్య, కుమారి పాల్గొన్నారు.

దాడికేసులో ఇద్దరి రిమాండ్

మహబూబాబాద్ రూరల్: భూతగాదా విషయంలో తలెత్తిన ఘర్షణలో బీరయ్య అనే వ్యక్తిపై దాడిచేసి గాయపరిచారని అతడి తల్లి కొమురమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కృష్ణ, ముకేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శనివారం తెలిపారు. గత నెల 14వ తేదీన ఎన్టీఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న స్థలంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా బీరయ్యపై కృష్ణ, ముకేష్ దాడిచేసి గాయపరిచారన్నారు.